

జిల్లాలో ఎల్లో అలర్ట్

- మరో 48 గంటలు అప్రమత్తం
- పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి
- టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్



టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఎల్లో అలర్ట్ కలదని, మరో 48గంటలు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. ఆదివారం జిల్లాలో మాండూస్ తుపానుకు సంబంధించి వివిధశాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్‌లు ఎంపీడీఓలతో క్షేత్రస్థాయి పరిస్థితులపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్లో అలర్ట్ కలదని, మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం కలదని తెలిపారు. భూమి తడిగా ఉన్నందున వర్షంపడిన వెంటనే నీటిప్రవాహం ఎక్కువ అవుతుందని వంకలు, వాగులలో నీటిప్రవహ సామర్థ్యంపై నిఘా ఉంచాలన్నారు. వంకలు, వాగులు ప్రజలు దాటే ప్రయత్నం చేయకుండా పోలీసు వారి సహకారంతో తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వివిధ సంబంధింత శాఖల జిల్లా, డివిజన్, మండలాల, సచివాలయం స్థాయిలో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టంను అంచనా వేయాలన్నారు. అలాగే రోడ్డు, చెరువులు, ఇతర నష్టాలకు సంబంధించిన నివేదికను ఆదివారం సాయంత్రం లోపు పంపాలని ఆదేశించారు. వర్షం కారణంగా ఎక్కడైనా విద్యుత్తు కనెక్షన్‌లకు అంతరాయం ఏర్పడితే వెంటనే విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను, ఎన్టీఆర్ జలాశయం కృష్ణాపురం, వాగులు వంకలు, చెరువులు వద్ద ఎప్పటికప్పుడు నీటిసామర్థ్యంకు సంబంధించి నిఘాను పెంచాలని ఇరిగేషన్ ఎస్ఈని పంటనష్టం సంబంధించి వ్యవసాయ, ఉద్యానవన, సిరికల్చర్ శాఖల అధికారులు అంచనాలను సిద్ధంచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన సిరికల్చర్ అధికారులను, వర్షం తగ్గిన వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, ప్రజలకు క్లోరినేషన్ చేసిన తరువాత తాగునీరుని సరఫరా చేయాలన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని పరీక్ష చేయాలని ఎస్ఈఆర్‌బ్ల్యూఎస్ అధికారులను, ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలని డిపిఓను, మున్సిపల్ కమిషనర్లను, ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని వసతులు కల్పించాలనన్నారు. శాఖలవారీగా తీసుకుంటున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

పరీక్షల వేళ బదిలీలా..!

ఉపయోగం లేదని ఉపాధ్యాయుల విమర్శ



బదిలీల పైన అధికారులతో డీఈఓ చర్చలు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

పాఠశాలల సెలవుల సమయంలోనే బదిలీలు చేయాలని ఉపాధ్యాయులు నెత్తినోరు మొత్తుకున్నా ప్రభుత్వం వినలేదు. ఇప్పుడు మరో మూడు నెలలు పరీక్షలు ఉండగా ఇప్పుడు బదిలీలకు పచ్చజెండా ఊపింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం కావాలనే సమస్యలను పక్కదారి పట్టించాలని ఎందుకూ కొరగాని బదిలీలను చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇందులో అసంబద్ధమైన అంశాలు చాలా ఉన్నాయని, వాటిని తొలగించాలని డిమాండు చేస్తున్నారు.

డిసెంబర్ 12 నుంచి జనవరి 12వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ జరగనుంది. నెల రోజుల పాటు ఈ తంతు సాగనుంది. జిల్లా విద్యాశాఖకు సంబంధించి ఈ నెల12, 13వ తేదీల్లో ఖాళీలను వెల్లడించనున్నారు. ఉపాధ్యాయులు 14 నుంచి 17వ తేదీ వరకు దరకాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు, ఉపాధ్యాయులు ఎనిమిదేల్లు ఒకే చోట పని చేసి ఉంటే బదిలీ తప్పనిసరి. జీరో సర్వీసు ఉన్నా బదిలీ చేయించుకోవచ్చుని ఆదేశాలున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 700మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఈ లోగా ఆగమేఘాలపై ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ప్రభుత్వం కావాలనే ఇలా ఈ సమయంలో బదిలీల ప్రక్రియ చేపట్టిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయులకు 11వ తేదీ వస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు రాలేదు. అలాగే సిపిఎస్ రద్దుపైన ఉవ్వెత్తున పోరాడుతున్నారు. అంతేకాకుండా శాసన మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయని ఆరోపణలున్నాయి. వీటన్నింటి నుంచి తప్పించుకునేందుకే ఇప్పుడు ప్రభుత్వం బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. బదిలీల కోసం ఉపాధ్యాయులు మూడు నెలలుగా ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో ఉత్వర్వులు జారీ చేయలేదు. అవసరం లేదనుకునే సమయంలో విడుదల చేశారు. పదో తరగతి బోధించే ఉపాధ్యాయులు మధ్యలో బదిలీల వల్ల ఆపేస్తే విద్యార్థులు ఇక్కట్లు పడతారు. కావున వచ్చే ఏడాది వేసవిలో బదిలీలు నిర్వహించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గత ఏప్రిల్, మేనెలలో నిర్వహించాల్సిన బదిలీలను ఈ డిసెంబర్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జీవో నెంబర్ 157ను విద్యాశాఖ విడుదల చేసిన నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో వేలాదిగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నప్పటికీ వాటి భర్తీకి తగిన కషి చేయకుండా విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేపట్టే సందర్భంలో ఎన్నో అసంబద్ధమైన అంశాలను బదిలీల సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యంగా జీవో నెంబర్ 117 ప్రకారం 97 అంతకంటే తక్కువ ఉన్న యూపీ పాఠశాలలో పాఠశాల సహాయకులను సర్దుబాటు పేరుతో ఎలాంటి అదనపు పాయింట్లు లేకుండా చేయడం వారిని చాలా ఆందోళనకు గురిచేస్తున్నదని తెలియజేస్తున్నాం..

- జివి.రమణ యుటిఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

తుపాన్ బాధితులకు నష్టపరిహారం అందించండి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ , జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మాండూస్ తుపాన్ బాధితులకుఉదారంగా నష్టపరిహారం అందించాలని రాష్ట్ర విద్యుత్ అటవీ శాస్త్రసాంకేతిక, పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అనంతపురం జిల్లా సచివాలయం నుంచి రాష్ట్ర అటవీ, విద్యుత్ పర్యావరణశాస్త్ర సాంకేతిక భూగర్భ గనులశాఖ మంత్రి చిత్తూరు జిల్లాఇన్చార్జి మంత్రి ఉషశ్రీచరణ్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్.రెడ్డప్పతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను పరిస్థితిపై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లుతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన వారికి ఉదారంగా నష్టపరిహారం చెల్లించేలా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా కచ్చితంగా చేపట్టాలని, బాధితులకు న్యాయం జరగాలని, పునరావాస కేంద్రాలలో ఉంటూ ఆశ్రయం పొందిన వారికి ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థికసాయం అందజేయాలని పేర్కొన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో చిత్తూరు నుండి జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో 9 నుండి 10వతేదీ ఉదయం వరకు 53.8 మిమీ, 10వ తేది 8 గంటలనుండి నేటి ఉదయం 8 గంటల వరకు 38.8 మిమీ వర్షపాతం నమోదుఅయిందని తెలిపారు. మొదటి రోజు నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదు కావడం జరిగిం దని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ అన్ని ముందస్తు చర్యలు తీసు కొంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా కలదని, భూమి తడిగాఉండటం వల్ల కొద్దిపాటి వర్షంపడిన నీటిప్రవాహం పెరుగుతుందనే ఉద్దేశ్యంతో కాజ్‌వే, వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద నిరంతర పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రాలలో 416మంది ఆశ్రయం పొందారని, ఎక్కువగా 95% యానాది కుటుంబాల వారిని ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని వీరందరికి ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థిక సాయాన్ని అందిస్తామని, పునరావాస కేంద్రాల నుంచి వెళ్ళేటప్పుడు ఒక కుటుంబానికి రూ.2 వేలు, ఒకరికి వెయ్యి రూపాయల అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే సహాయక చర్యల్లో భాగంగా జిల్లాకు ఎన్డీఆర్ఎఫ్ బందాలు రావడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ శాఖలు పంటనష్టం అంచనా ప్రక్రియను చేపట్టడం జరుగుతున్నదన్నారు. ప్రాథమిక అంచనా మేరకు జిల్లాలో 709 ఎకరాలు వ్యవసాయ రంగంలో, 257 ఎకరాలు ఉద్యానవన శాఖలో పశుసంవర్ధక శాఖ సంబంధించి 3 మేకలు చనిపోయాని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ 2 ట్యాంకుల్లో మైనర్ రిపేర్లు కలవని,పెద్దగా ఎక్కడా సమస్య రాలేదని, విద్యుత్ శాఖకు సంబంధించి 157 ఫోల్స్ డ్యామేజ్ కాగా 100 శాతం వాటిల్ని పునరుద్ధ రించడం జరిగిందని నిరంతరంగా విద్యుత్ సరఫరాచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని అందజేస్తున్నామని సురక్షిత తాగునీరు అందజేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి పైప్లైన్ లీకేజ్ లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకొని త్రాగునీరు సరఫరా చేయడం జరుగుతున్నదన్నారు. వర్షాల వల్ల ప్రబలే వ్యాధుల నుండి ప్రజలను కాపాడేందుకు వైద్యఆరోగ్యశాఖను అప్రమత్తం చేసి పిహెచ్‌సిలకు వచ్చే కేసులపై ప్రత్యేకదష్టి సారించాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులకు, వర్షం నిలిచిన వెంటనే పారిశుధ్యం పనులను చేపట్టేలా డీపీఓ మున్సిపల్ కమిషనర్లను సూచించడం జరిగిందని కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డీఆర్ఓ ఎన్.రాజశేఖర్ వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలు విజయవంతం



చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జెవివి నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లాస్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు చిత్తూరులోని పీఎస్ పబ్లిక్‌స్కూల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 44 మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చెకుముకి సంబరాలను ఉద్దేశించి జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ సైన్స్‌వల్లే జాతి అభివద్ధి చెందిందని తెలిపారు. అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలు అందించాలని కోరారు. జిల్లాస్థాయి జడ్‌పిహెచ్‌ఎస్ కుప్పం మండల విద్యార్థులు శిరీష, లక్ష్మీచైతన్య, విష్ణువులు ప్రైవేటు పాఠశాల నుంచి మంగళ విద్యాలయం విద్యార్థులు భవ్యశ్రీ, లోకప్రకాష్, దేవకీనంద్ రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో పీఈఎస్ ప్రిన్సిపాల్ కష్ణ బాబు, జెవివి నాయకులు గల్లా రంగనాథం, త్యాగరాజు, శ్యామల, జయంతి, హేమాద్రి అరుణ శివప్రసాద్, సుదర్శన ఆచారి గిరిధర మూర్తి, నందకుమార్, ద్వారకానాథ్, విజయకుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (12.12.2022) ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చుని చెప్పారు.

నీటి సరఫరా, పారిశుధ్యంపై

ప్రత్యేకశ్రద్ధ పెట్టండి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వర్షాల నేపథ్యంలో నగరంలో నీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కమిషనర్ నగరంలోని పలుప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి నీటి సరఫరా, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో నీటిసరఫరా పక్కాగా జరిగేలా చూడాలన్నారు. నీటిని క్లోరినేషన్ కచ్చితంగా చేయించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో నీటికి క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. టిటిడి కళ్యాణ మండపం పక్కన ఉన్న సిఎస్ఆర్ ప్రధాన ట్యాంకును కమిషనర్ పరిశీలించారు. నీటికి క్లోరినేషన్ పరీక్ష చేయించారు. మోటార్లను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో నీటిసరఫరాకు ఎక్కడ అంతరాయం ఉండరాదని, లీకేజీలకు సత్వరం మరమ్మతులు చేయించాలని డీఈలు, ఏఈలను ఆదేశించారు. అనంతరం కమిషనర్ చర్చివీధి, మార్కెట్, స్లాటర్ హౌస్, గంగనపల్లి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. నగరంలో ఎక్కడా వ్యర్థాలు కనిపించరాదని, వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పారిశుధ్య పనులు వేగవంతం చేయించాలన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి, అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయించాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈలు రమణ, వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్, బిఎస్ఎన్ఎల్ సహకార క్రెడిట్ సొసైటీ ఎన్నికలు

10 డైరెక్టర్ పోస్టులకు 17 మంది పోటీ

నేడు అధ్యక్ష పదవికి ఎన్నికలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు జిల్లా పోస్టల్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం స్థానిక పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికల్లో 17 మంది పోటీ పడ్డారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం 739 ఓట్లుకు గాను 526 ఓట్లు పోలియ్యాయి. ఇదేవిధంగా ఇందులో 12 ఓట్లు చెల్లుబాటు కాలేదు. చెల్లుబాటైన 514 ఓట్లలో మెజార్టీ ఓట్లు సాధించిన 10 మందిని డైరెక్టర్లుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. విజయం సాధించిన వారిలో ఏవీ భాస్కర్ (389 ఓటు), దండాయుదపాణి (384), బాలన్ కాలు (382 ఓట్లు), రఘుపతి (375), నాగరాజు (373), రెడ్డప్ప (364), మదన్ మోహన్ రెడ్డి (356), హేమంత్ (352), శేషాద్రి (351), వెంకటేశ్వర్లు (346 ఓట్లు) ఉన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, జిల్లా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్ ఆరీపుల్లా మాట్లాడుతూ ఎన్నికైన డైరెక్టర్లు సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలోని సహకార క్రెడిట్‌సొసైటీ కార్యాలయంలో ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారిలను ఎన్నుకోవడంతో ఎన్నికల తంతు ముగుస్తుందన్నారు. ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు 5 సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతూ పోస్టల్, బిఎస్ఎన్ఎల్, ఆర్ఎంఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కషి చేయాలని కోరారు. ఎన్నికల్లో అత్యధిక ఓట్ల పొంది డైరెక్టర్ గా విజయం సాధించిన ఏవి భాస్కర్ మాట్లాడుతూ క్రెడిట్ సొసైటీ ద్వారా ఒక్కో సభ్యునికి ప్రస్తుతం కేవలం 50 పైసల వడ్డీ రేటుతో మంజూరు చేస్తున్న రూ 4 లక్షల రుణ పరిమితిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుల సంఖ్యను పెంచేందుకు సైతం తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా డివిజనల్ సహకారాధికారి యు.వనజ, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కిషోర్ కుమార్, మహమ్మద్‌రఫీ, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, ఆర్ఎంఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు శరత్, శ్రీధర్ బాబు, సర్దార్, దామోదరం, నాదముని, రఘుపతితో పాటు పెద్ద ఎత్తున బిఎస్ఎన్ఎల్, పోస్టల్, ఆర్ఎంఎస్ సహకార క్రెడిట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



రైటప్: చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జనవిజ్ఞాన వేదిక నాయకులు

65 గ్రామాలలో 280ఎకరాల పంట నష్టం

వ్యవసాయ శాఖ అంచనా



ప్రజాశక్తి- పుంగనూరు: మాండూస్ తుపాన్ ప్రభావంతో పుంగనూరు డివిజన్ పరిధిలోని 65 గ్రామాలలో 280 ఎకరాల పంట నష్టం జరిగింద వ్యవసాయ శాఖ ఏడి సి.శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, పెద్దపంజాణి, గంగవరం మండలాలు వస్తుందన్నారు. ఇప్పటివరకు మండల వ్యవసాయ అధికారులు సందర్శించి వేసిన ప్రాథమిక అంచనా ప్రకారం, తుపాన్ వల్ల దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించినట్లు తెలిపారు. కోతదశలో వున్న వరి 56 గ్రామాలు విస్తీర్ణం 268.20 ఎకరాలు, చెరకు 8గ్రామాలు విస్తీర్ణం 17.75 ఎకరాలు, వేరుశెనగ 1 గ్రామం- 4 ఎకరాలు పంట నష్టం జరిగినట్లు చెప్పారు. వర్షాలు శనివారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టడం వలన దెబ్బతిన్న పంటలు రికవరీ అయ్యి నష్టం తగ్గుతుందని చెప్పారు. ఈసందర్భంగా రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పలు సూచనలు చేశారు. కోతదశలో వున్న వరి గాలులకు పడిపోయినట్లయితే 4-5 వరి దుబ్బులను ఒక దగ్గరకు చేర్చి కట్టలుగా కట్టి పంటను కాపాడుకోవచ్చు అని తెలిపారు. పంటలో అధికంగా వున్న నీరు తీసివేసి కంకులపై 5శాతం ఉప్పు ద్రావణం (50గ్రాముల ఉప్పు ఒక లీటరు నీటికి) పిచికారి చేసి తడిసిన గింజల నాణ్యత కాపాడుకోవచ్చు అన్నారు. మిగిలిన పంటలలో కూడా వెనువెంటనే నీరు తీసివేసి నేల ఆరబెట్టుకున్నట్లయితే పంటలను కాపాడుకోవచ్చు అని చెప్పారు.

తుపాన్‌కు అరటితోట ధ్వంసం- సుమారు రూ. 3లక్షలు నష్టం

గంగవరం: పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేట గ్రామానికి చెందిన రైతు ఉమాపతి గంగవరం మండల పరిధిలో మూడుఎకరాల్లో అరటి తోట నాటుకున్నారు. మాండూస్ తుపాన్ ప్రభావంతో అరటి తోట పూర్తిగా నేలకొరిగింది. దీంతో సుమారు రూ.3లక్షలు పైగా నష్టం వచ్చినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అరటి తోటను పరిశీలించి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రామకుప్పం: మండల కేంద్రంలో శనివారం రాత్రి మాండస్ తుపాను వలన ఎడతెరిపిలేని వర్షంతో నివాసముంటున్న ఇల్లు ధ్వంసం అయింది. రెడ్డివీధిలోగల గోపాల్‌రెడ్డికి చెందిన పెంకుటిల్లు గోడలు బీటలువారి నేలకొరిగింది. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, సామాగ్రి ధ్వంసం అయిందని బాధితులు తెలిపారు. ఎటువంటి ప్రాణహాని జరగలేదన్నారు. ఈ మేరకు సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

ఏపీ ఎన్జీవో జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవం

- జిల్లా అధ్యక్షులుగా కేవి రాఘవులు ఎన్నిక

- మరో 14 పదవులు ఏకగ్రీవం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీ ఎన్జీవో) అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కెవి.రాఘవులు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఏపీఎన్జీవో జిల్లా కార్యవర్గానికి ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఏపీఎన్జీవో అసోసియేషన్ వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు వివరించారు. ఈక్రమంలో జిల్లా అధ్యక్షులుగా రాఘవులు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు మరో 14 మంది కార్యవర్గ ప్రతినిధులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిలో అసోసియేట్ అధ్యక్షులుగా పిబి మురళీకష్ణ (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చిత్తూరు), ఉపాధ్యక్షులుగా బి.బాలసుబ్రమణ్యం (సబ్‌ట్రెజరీ కార్యాలయం, బంగారుపాలెం), వై.లక్ష్మీపతి, పంచాయతీరాజ్‌శాఖ పలమనేరు సబ్‌డివిజన్), ఎన్‌వి.వరప్రసాద్ (రుయా వైద్యశాల తిరుపతి), టిఎన్.పురుషోత్తం రెడ్డి (రవాణాశాఖ, పుంగనూరు), విఎస్ రెడ్డియప్పన్ (తహశీల్దార్ కార్యాలయం, కార్వేటినగరం), ప్రధానకార్యదర్శిగా వీజీ రఘు (జిల్లావ్యవసాయశాఖ కార్యాలయం, చిత్తూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్‌జె.ప్రదీప్‌కుమార్ (ప్రభుత్వ ఐటిఐ, చిత్తూరు), సంయుక్త కార్యదర్శులుగా కే.రమేష్ (ఎకనామికల్ అండ్ స్టాటిస్టికల్ కార్యాలయం, చిత్తూరు), ఎంబి.మహేష్ కుమార్ (ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, తూంగుంద్రం), సురేష్‌కుమార్ (ఆర్అండ్‌బి హైవేస్ కార్యాలయం, చిత్తూరు), సురేష్ (పట్టుపరిశ్రమశాఖ కార్యాలయం, చిత్తూరు), సంయుక్త కార్యదర్శి (మహిళలు)గా ఎన్ఎం సునీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేగల్లు, పీలేరు మండలం)తోపాటు జిల్లా కోశాధికారిగా ఎస్.మురళి మోహన్ (జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, చిత్తూరు) ఉన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు 3 సంవత్సరాల పాటు తమ పదవుల్లో కొనసాగుతారని వెల్లడించారు. కాగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను జిల్లాలోని ఆయా తాలూకాల ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు దుస్సాలువలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 12వ తేదీ సోమవారం యథావిధిగా జిల్లా సచివాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నుంజర్ల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్



నుంజర్ల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి- యాదమరి: జిల్లాలో మాండుస్ తుపాను నేపథ్యంలో యాదమరి మండలం నుంజర్ల ప్రాజెక్టును ఆదివారం జిల్లాకలెక్టర్ యం.హరినారాయణన్ పరిశీలించారు. మండల పరిధిలోని భూమిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో నుంజర్ల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటితో నుండి ప్రవహిస్తుంది. మాండూస్ తుపాన్ నేపథ్యంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం మధ్యాహ్నం ప్రాజెక్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి మొరవ కాలువల్లో నీరు ప్రవహిస్తుండడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీవా పరివాహక ప్రాంతం, వాగులు సమీపంలోని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రాజెక్టు నీటిప్రవాహంకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఈప్రాజెక్టుకు వెళ్లే దారిలో, ప్రాజెక్టు కట్టపైన చెట్లపొదలను శుభ్రం చేయాలని, వెళ్లేందుకు దారిని సౌకర్యవంతంగా ఏర్పాటు చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నుంజర్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 15.65 క్యూసెక్కులు కలదని, ఈప్రాజెక్టు నిండితే నుంజర్ల చెరువు, నడిమి చెరువులకు నీరు వెళుతుందన్నారు. చెరువులు పూర్తిస్థాయిలో నిండిన తర్వాత నీవానదిలో నీరు ప్రవహిస్తుందని తహశీల్దార్ చిట్టిబాబు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ ఎంపీడీఓ శివరాం, ఇరిగేషన్ అసిస్టెంట్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పాలనలోనే అభివృద్ధి..

ఎమ్మెల్యే వెంకటేగౌడ



ప్రజాశక్తి-వి.కోట: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన వి.కోటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయవ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. సుమారు రూ.40లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి సచివాలయాలకు వచ్చే ప్రతి సమస్యను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని.. ఆయన ఆరోపించారు. తాముచేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి గడపలోని సమస్యను తెలుసుకుని వాటి పరిష్కారానికి కషి చేస్తున్నామని .. రాబోవు రోజుల్లో అభివద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లాల్లో పలమనేరును నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, రాష్ట్ర వైకాపా కార్యదర్శి పీఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీ తమీంఖాన్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాల గురునాథ్, వి.కోట ఉపసర్పంచ్ అక్మల్ ముదరందొడ్డి సర్పంచ్ దామోదర్ ఎంపీటీసీలు వార్డు సభ్యులు ఎంపీడీవో బాలాజీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వెంకటే గౌడ



ప్రజాశక్తి - వీకోట : మండల కేంద్రమైన వీకోటలోని శాఖ గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. ఆదివారం వారు ఆకస్మికంగా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాఠకుల సంఖ్య పెంచేందుకు తగు సూచనలు చేశారు. మండలంలో పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ హరినాథ్‌రెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం తీర్థం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. తీర్థం గ్రామంలో పర్యటించి ప్రజలకు కలుషిత నీరు, అపరిశుభ్రతతో కలిగే నష్టాలపై వివరించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాతపేట గ్రామంలో తాగునీటి ట్యాంకు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ విజయ్ చందర్, డాక్టర్ అరుణ్, జీహెచ్‌వో అనురాధ, నిరుపమ, సావిత్రి, అరబ్ జాన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జంగాలపల్లిలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు



ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలోని అబకలదొడ్డి పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గత మూడు రోజులకు కురుస్తున్న మండుస్ తుఫాన్ కారణంగా జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఏఎస్ హేమమాలిని తెలిపారు. మండల పరిధిలో ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆమె వైద్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. జంగాలపల్లిలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఉష, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా కళాతరంగిణి 30వ వార్షికోత్సవ సంబరాలు




ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కళాతరంగిణి సంస్థ అధినేత రాజేష్‌బాబు స్థానిక మండల కేంద్రంలోని రాయల్ మహల్‌లో 30వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి నాట్యం సినీ రంగాల్లోని, వివిధ పోటీలలో విద్యార్థులు పాల్గొంటున్నారు. సోమవారం పోటీలు కొనసాగుతాయని గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు కళాతరంగిని అధినేత రాజేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతులుగా డాన్స్ మాస్టర్ బాలరాజు, సురేష్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

రైతులు పంట నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-వి.కోట : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు పండించిన ఉద్యాన పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి ఉద్యాన అధికారులు ఆదేశించారు. ఆదివారం ఆయన తుపాన్‌తో ప్రభావితమైన పలమనేరు, వి.కోట మండలాల్లో టమోటా, బంగాళదుంపతో పాటు ఇతర ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు సలహాలు అందించి పంటలు నష్టపోకుండా తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వ్యవసాయ శాఖాధికారి రాజ్యలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ప్రభుత్వంతోనే పేదల అభివద్ధి



ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలు ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని జెడ్పీటీసీ నితిన్ రాఘవరెడ్డి తెలిపారు. ఆదివారం మేజర్ గ్రామ పంచాయతీలోని మిట్టపల్లి గ్రామంలో వైఎస్సార్ బీమా పథకాన్ని అందించారు. గ్రామానికి చెందిన కేశవరెడ్డి అనారోగ్యంతో మతిచెందాడు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, ఆరోగ్య బీమా అధికారులు తక్షణసాయంగా రూ.10 వేలు వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో రాధారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వంశీరెడ్డి, రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది యువరాజు, నిత్యానందశెట్టి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కాగృహాలు : పీడీ పద్మనాభం



ప్రజాశక్తి-కార్వేటినగరం: అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కాగృహాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పీడీ పద్మనాభం అన్నారు. ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆదేశాల మేరకు మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని సుద్దగుంట, బండ్రేవుకాలనీలను తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో మోహన మురళీలతో కలసి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ మాట్లాడుతూ సుద్దగుంట గ్రామాన్ని సందర్శించి ఏడు దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన 54 పక్కాగహాలు దుస్థితికి చేరుకున్నాయని.. అందులో ప్రతి గహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కాగహాలు మంజురు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీవో రవి, పంచాయతీ ఈవో పీఎన్ మణి, ఏపీఎం విజయకుమార్, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి గోపినాథ్, వార్డుమెంబర్ దొరబాబు, ధనశేఖర్ వర్మ, వెలుగు సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంట సాగులో జాగ్రత్తలు పాటించాలి



ప్రజాశక్తి -పులిచెర్ల: వ్యవసాయ పంట పొలాల్లో నీటి నిల్వలు లేకుండా రైతులు మరింత జాగ్రత్తలు పాటించాలని మండలం ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి తెలిపారు. పులిచెర్ల మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ఆదివారం ఉద్యానశాఖాధి కారిణి సంతోషికుమారి పర్యటించారు. వ్యవసాయ పంటలకు వచ్చే నష్టాలపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా సంతోషికుమారి మాట్లాడుతూ ఎడతెగని వర్షం, చల్లని ఉష్ణోగ్రత, భారీ గాలుల కారణంగా పంటలు పడిపోవడంతో పాటు కూరగాయల పంటలకు తెగుళ్ల సంభవిస్తాయన్నారు. తుఫాను ప్రభావంతో రైతులు పరోక్షంగా, ప్రత్యక్షంగా నష్టపోతారన్నారు. వర్షాల కారణంగా కూరగాయల పంటల్లో నిలిచిపోయిన నీటిని వెంటనే తొలగించాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే కూరగాయలు, పూలతోటలకు పాలీ ఫీడ్ లేక మల్టీ కెను 5నుండి 7 గ్రాముల మందును లీటరునీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కుళ్ళిన పండ్లను తక్షణం పంటనుండి తొలగించి మట్టిలో పూడ్చి పెట్టాలన్నారు. టమోటా పంటలు ఆకుమచ్చ, పండ్లకుళ్ళ తెగుళ్ల వ్యాప్తిని నియంత్రించేందుకు వర్షాలు ఆగిన వెంటనే 2 గ్రాముల క్లోరోథలోనిల్ లేదా మెర్జి ల్ లేదా డైతేన్ జెడ్ 78 మందును లీటరునీటిలో పిచికారీ చేయాలన్నారు. టమోటాపై విపరీతంగా వచ్చే ఉర్లగడ్డ తెగులు నివారణకు అలియోట్ 2 గ్రాములు, డైతేన్ ఎం45 లీటరునీటిలో కలిపి పిచికారీ చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయన్నారు. తుఫాను కారణంగా జరిగే నష్టాలపై రైతులు ఉద్యాన శాఖ సూచనలు పాటించాలని ఆమె తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం



ప్రజాశక్తి-పలమనేరు: తుపాన్ కారణంగా పంట నష్టం జరిగిన ప్రతి సెంటుకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఎవరూ ఇబ్బందికి గురికావాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి రత్న ప్రసాద్ తెలిపారు. ఆదివారం పలమనేరు మండలంలో ఆయన పలు ప్రాంతాలలో పంట నష్టం కలిగిన ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రకతి వైపరీత్యాలు జరిగినప్పుడు పంట నష్టం కలిగితే ప్రస్తుతం ప్రభుత్వం అన్నివిధాలా సహకరించడం జరుగుతుందని.. నష్టం వివరాలు తెలుసుకుంటున్న అధికారులకు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశాల మేరకు తూర్పు ప్రాంతాలలోను, పడమటి ప్రాంతాలలో పంట నష్టం వివరాలను సేకరించడం జరుగుతోందన్నారు. పంట నష్టపోయిన వ్యవసాయదారుల వివరాలు సిబ్బందికి ఇస్తే వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపి పరిహారం కోరేందుకు వీలుంటుందని.. ఇందుకోసం నష్టపోయిన పంటల పూర్తి వివరాలు అందించాలన్నారు. అయన వెంట మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో ఉద్యోగులకు తిప్పలు'



ప్రజాశక్తి-వెదురుకుప్పం: వైసీపీ పాలనలో ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదని టీడీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ మీడియా కో-ఆర్డినేటర్ గురుసాల కిషన్ చంద్ విమర్శించారు. వెదురుకుప్పంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ వచ్చాక ఉద్యోగమే జీవనోపాధిగా నమ్ముకొని బతుకుతున్న వారి బతుకుల్లో ప్రభుత్వ పనితీరు గుదిబండగా మారిందని ధ్వజమెత్తారు. కరోనా పరిస్థితుల్లో సైతం పని ఒత్తిడి తట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయితే ఆ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీ జమ కావాల్సిన జీతాలు జమ కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీ అందాల్సిన జీతాలు 11వ తేదికీ జమ కాకుండా వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బ తింటున్నాయని ఆరోపించారు. ఉద్యోగులు ప్రధానంగా గహ, వ్యక్తిగత, వాహన, గృహోపకరణాల రుణాలను, బ్యాంకులు, ఇతర ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొంది వారికి చెక్కులు అప్పగించిన ఉద్యోగులకు చుక్కలు కన్పిస్తూ డీఫాల్ట్ జాబితాలోకి వెళ్లిపోతున్నారని వివరించారు. డీఫాల్ట్ జాబితాలోకి వెళ్లడంతో చెక్ బౌన్స్ తో పాటు పెనాల్టీలు తప్పవన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పిల్లల ఫీజులు తదితర వాటికి సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే పదవీ విరమణ పొందిన పింఛనుదారుల పరిస్థితి వైసీపీ పాలనలో సకాలంలో సక్రమంగా పింఛను డబ్బులు జమ కాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వయసుపై వారికి సకాలంలో డబ్బులు జమ కాకుండా ఆస్పత్రి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని.. తమ దష్టికి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో నిర్ణీత కాలంలో ఉద్యోగులకు, పింఛనుదారులకు వారి వారి ఖాతాల్లో జమ అయ్యేదని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు, పెన్షన్ సంఘం నాయకులు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణీత సమయంలోనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ దారులకు పెన్షన్ వారి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

17న షటిల్ క్రీడా పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఈనెల 17, 18వ తేదీలలో తీన్మార్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గూడూరు పట్టణం లోని పీఆర్ గ్రానైట్ సమీపంలోని హెచ్‌డీ బ్యాడ్మింటన్ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా వలన రెండేళ్లపాటు షటిల్ పోటీలను నిర్వహించలేకపోయామన్నారు. వైజీఎస్బీఏ ఆధ్వర్యంలో ఎటువంటి వసతులు లేనిసమయంలోనే గూడూరులో పట్టణ, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో బాడ్మింటన్ క్రీడా పోటీలను ఎంతో ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. హర్ష, దీపుల చొరవతో జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ఇండోర్ స్టేడియం ఏర్పాటైందన్నారు. దీనికిగాను హర్ష, దీపులను క్రీడాకారుల తరపున అభినందిస్తున్నామన్నారు. డిసెంబర్ 17, 18న జాతీయ, రాష్ట్ర స్థాయిలలో రాణించిన స్థానిక క్రీడాకారులతో తీన్మార్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, అలాగే నియోజకవర్గ స్థాయి క్రీడాకారులతో మరొక విభాగం, జాతీయ, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు, స్థానిక క్రీడాకారులతో కలిసి మరొక విభాగం మొత్తం మూడు విభాగాలలో తీన్మార్ షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు 18వ తేదీ ఆదివారం 9-30 గంటలకు హెచ్ డీ ఎరీనా స్టేడియంకు చేరుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 24, 25 తేదీలలో ఇంటర్ స్టేట్, జనవరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు పట్టణ ప్రముఖులు దాతలుగా వ్యవహరించి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైజీఎస్బీఏ అధ్యక్షులు షేక్. జమాలుల్లా మాట్లాడుతూ 24, 25 తేదీలలో ఇంటర్ స్కూల్ షటిల్ టోర్నమెంట్ ను గూడూరు, నాయుడు పేట డివిజన్ స్థాయిలలో బాలుర, బాలికల విభాగాలలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిరుపేద క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలోరాణించేలా కషి చేస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్. అబ్దుల్ కలామ్ మాట్లాడుతూ జనవరి 20వ తేదీ పైన వైజీఎస్బీఏ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 18న నిర్వహించే తీన్మార్, 24, 25 తేదీలలో నిర్వహించనున్న ఇంటర్ స్కూల్, జనవరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి షటిల్ పోటీలను పట్టణ క్రీడాకారులు, క్రీడా భిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైజీఎస్బీఏ సభ్యులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి, హెచ్ డీ ఎరీనా స్టేడియం నిర్వాహకులు హర్షవర్ధన్ రెడ్డి, షేక్ జమాలుల్లా, షేక్. అబ్దుల్ కలాం, కోదండపాణి, వల్లూరు రమేష్, పీఆర్ గ్రానైట్ ప్రభాకర్, మల్లికార్జున్ రావు, సునీల్, ఇంతియాజ్ (మాస్టర్), రూపేష్, సాధిక్, ఆఖిల్, అతిక్ పాల్గొన్నారు.

13న బహిరంగ వాహనాలకు వేలం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఈ నెల 13న పుత్తూరు సెబ్ స్టేషన్‌లో బహిరంగంగా వాహనాలు వేలం జరుగుతుందని పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. సెబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని ఉన్న సెబ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను డివిజన్ పరిధిలోని సెబ్ స్టేషన్లో ఎక్సైజ్ నేరంలో పట్టుబడ్డ వివిధ వాహనాలు వేలం వేయడం జరుగుతుందని తెలిపారు.

ఆసక్తి కలిగిన వారు ధారావత్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆయన కోరారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.



చెరువుల భద్రత పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మాండూస్ తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా నిండిన చెరువులను ఆదివారం తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్రాయల్‌పేట చెరువును పరిశీలించి ఇరువైపులా ప్రజలు రాకుండా చూడాలని, ఏ సమయంలోనైనా చెరువు పొంగే పరిస్థితులు ఉన్న సందర్భంలో సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. నిండిన చెరువుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వో శివకుమార్, వీఆర్ఏలు పాల్గొన్నారు.



బాధితుల కోసం సహాయ శిబిరం

ప్రజాశక్తి-శాంతిపురం: మాండూస్ తుపాను కారణంగా మండల పరిధి జంగాలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలు ఇళ్ల వర్షానికి ఉరుస్తున్నాయి. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ఇళ్ల పైకప్పులు వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు జంగాలపల్లి ప్రాథమిక పాఠశాలలో, పంచాయతీ రాజ్, రెవెన్యూశాఖ అధికారులు శనివారం నుంచి వరద సహాయక చర్యలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో శబరి యాత్ర



ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం : మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్టలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భక్తులు అంబల పూజ నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 130 మంది అయ్యప్ప భక్తులు రవి, మణికంఠ, వెంకటరమణ గురు స్వాముల ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపల్లిలో పూజలు చేపట్టారు. కొత్తపల్లి మిట్టలో అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి మూడు బస్సులతో శబరి యాత్రకు బయలుదేరారు.

వధూవరులకు చిట్టిబాబు ఆశీర్వాదం



ప్రజాశక్తి -ఎస్ఆర్‌పురం: హరిచందన, విష్ణుకుమార్‌ల నిశ్చితార్థ కార్యక్రమానికి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి చిట్టిబాబునాయుడు పాల్గొని వారిని ఆశీర్వదించారు. గంగమ్మ గుడి గ్రామానికి చెందిన జగదీశ్వరి, ప్రసాద్‌బాబుల కుమార్తె హరిచందన, శ్రీరంగరాజపురానికి చెందిన ప్రభావతి నాగరాజునాయుడు కుమారుడు విష్ణు కుమార్ ల నిశ్చితార్థ కార్యక్రమం వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలు బంధుమిత్రులతోపాటు తెలుగుదేశం నాయకులు గంధమనేని జయశంకర్ నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎస్ బాబుకు ఫెలోషిప్ అవార్డు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలానికి చెందిన డాక్టర్ జీవీఎస్ బాబుకు భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు అం దించారు. బాలలు, స్త్రీల హక్కుల కోసం కృషి చేయడంతో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు దక్కింది.

ప్రమాద సూచికల ఏర్పాటు



ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు పీలేరు జాతీయ రహదారి తిమ్మిరెడ్డి పల్లి వద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున ఆదివారం పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్ ప్రమాదాల నివారణకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలను అరికట్టాలంటే ప్రజలు సహకరించాలని కోరారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

తాళికట్టిన భర్తను హత్య చేయించిన భార్య



హత్య కేసులో నింధితులను చూపుతున్న డిఎస్‌పి శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఈనెల 5వ తేది రాత్రి చిత్తూరు సీతమ్స్ కళాశాల ఎదురుగా ఉన్న కోడిగుట్ట రోడ్డు వద్ద వడివేలు (32) దారుణ హత్యకు గురైయ్యారు. మృతుడి తల్లి రాణేమ్మ పిర్యాదు మేరకు చిత్తూర తాలుకా పోలీసులు కేసుమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో తాళికట్టిన భర్తను భార్య శెల్విరాణి హత్య చేయించిన్నట్లు పోలీసులు గుర్తించారు. శెల్విరాణి ప్రియుడు వినయ్ (30) ద్వారా తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న ఆటో డ్రైవర్ వడివేలును వినయ్ అతడి స్నేహితులు నిరంజన్, కిషోర్‌లు హత్య చేసిన్నట్లుగా ఆదివారం స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాసమూర్తి తెలిపారు. పథకం ప్రకారం వడివేలును ఆటో ఎక్కించుకొని బెంగుళూరు బైపాస్ వద్దగల సీతమ్స్ కళాశాల వద్దకు తీసుకుపోయి మద్యం తాగించి గొంతుకోసి హత్య చేసిన్నట్లుగా డిఎస్పి తెలిపారు. నింధితుల నుండి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. హత్యకు ప్రధానంగా వివాహేత సంబంధమే కారణమని తెలిపారు. హత్య కేసులో అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. హత్య కేసును నిందితుల అరెస్టులో కీలక పాత్ర ఫోషించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

దైవదర్శనానికి వెళ్తూ ప్రమాదం..!

భార్యాభర్తలు మృతి



ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చెంగల్రాయరెడ్డి భార్య కస్తూరి కాణిపాకం వెళ్లేందుకు బయలుదేరి బస్టాప్ వద్దకు నడిచి వెళ్తుండగా పీలేరు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మతిచెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్



ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలో ఇరవై మూడు గ్రామ పంచాయతీలలో తాగునీటి ట్యాంకులను పరిశీలించి ఎనిమిది రకాల నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి క్లోరినేషన్ చేసినట్లు ఎంపీడీవో ఏఎస్ హేమమాలిని తెలిపారు. జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, ఎంపీడీవో ఏఎస్ హేమమాలిని, తహసీల్దారు డి. లోకేశ్వరరావ్, కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఎస్ శ్రీనివాసులు, సర్పంచులు ఏవీ జయరాం, పుష్ప, చక్రపాణిరెడ్డి, చౌడమ్మ చిన్నప్ప, వైస్ ఎంపీపీ టీవీ పట్టాభి, ఏఈ విజయభాస్కర్, పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎస్‌కేలు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'జనసేన అభివృద్ధికి కృషి చేయండి'

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండల అధ్యక్షులు సుధాకర్, మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం కుప్పం మున్సిపాలిటీ పరిధిలో కార్యవర్గ సమావేశం జరిగింది. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, కుప్పం టౌన్‌లో నూతన కార్యాలయం ఏర్పాటుకు సహకారం అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వామనమూర్తి, చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి. మునెప్పా , గుడుపల్లి గణేష్ ,హేమంత్ , మూర్తి , రవితేజ ,రవీంద్ర, మూర్తి, మణి, కష్ణ, మధు, మహేష్ , సుబ్రమణ్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-డక్కిలి: జిల్లా వ్యాప్తంగా బదిలీలో భాగంగా తిరుపతిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగరాజు డక్కిలి మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నరసింహారావు తిరుపతికి బదిలీపై వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

'అరణియార్'ను టూరిజం ప్రాజెక్టుగా మారుస్తాం..!

ప్రజాశక్తి-పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్ట్‌ను టూరిజం ప్రాంతం మారుస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఆదివారం అరణియార్ ప్రాజెక్టు గేట్ల వద్ద ఎమ్మెల్యే చేతుల మీదుగా గంగమ్మకు జలహారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. అరణియార్ ప్రాజెక్టులో 29 అడుగుల నీటిమట్టం చేరడంతో సైరన్ మోగించి ఓ గేటు నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ప్రాజెక్టును జగనన్న ప్రభుత్వ చొరవతో టూరిజం ప్రాజెక్టుగా మారుస్తామని.. తుపాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో రోడ్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను తాకిడికి నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రజలకు భరోసా కల్పించారు, జగనన్న ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని.. ప్రాజెక్టు ద్వారా మత్స్యకారులకు, రైతులకు అన్ని సదుపాయాలు సమకూరుస్తామన్నారు. తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ లోకేష్, సీఐ సురేష్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పిచ్చాటూరు మండలం వైసీపీ అధ్యక్షులు కేటీ హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ రోస్‌రెడ్డి, చలపతి రాజు, పాలపద్మనాభం, మోహన్, తొప్పయ్య, త్యాగరాజు, వెంకటేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవిద్యకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి శ్రీవిద్యకు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎమ్.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విభాగపు ఆచార్య జయచంద్రారెడ్డి మార్గదర్శకత్వంలో "ఫైనాన్షియల్ పెర్ ఫార్మెన్స్ ఆఫ్ సెలెక్ట్ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజస్ ఇన్ ఇండియా" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంకు సమర్పించినట్లు వెల్ల డించారు. శ్రీవిద్యకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచా ర్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.